కథానిక

# అక్కరకురాని ఆదర్శాలు

ఆవసరాల రామకృష్ణారావు

నేను ఆసుపత్రినుంచి యింటికి వచ్చేసరికి మా నాన్నగారికి దగ్గూ, ఆయాసం బాగా ఎక్కువైపోయాయి. మా జానకి ఆయన కాళ్లు పడుతూ మాటిమాటికి కళ్లు తుడుచుకుంటోంది. ఆదృశ్యం చూసేసరికి నాగుండె గుభేలుమంది. నా మొహం చూడగానే నా వెర్రి చెల్లాయి "అన్నాయ్" అని నామీద పడిపోయి బావురుమంది. నేను లేని ధైర్యం తెచ్చుకుని,

"అదేమిటమ్మాయ్, నువ్వే అలా అధైర్యపడిపోతే ఎలాగే? నాన్నవింటే క్రుంగిపోరూ? మనం యిలా భయపడొచ్చా? ఛా, ఛా, లే" అని లేవదీశాను.

"నాన్నా, యిదుగో, ఆఁ అనండి మందు తెచ్చాను" అని నాన్నదగ్గరకు వెళ్ళాను. మా నాన్న ఖంగుఖంగుమని అతి కష్టంగా దగ్గి ఉమ్మేశారు. ఆ ఉమ్ములో రక్తజీర చూసేసరికి నా పై ప్రాణాలు పైనే పోయాయి. ఎలాగో వీలు చూసుకొని "బాబూ" అన్నారు. ప్రేమతో నా ఒంటిని స్పృశించారు. నా ఒళ్ళు పులకరించింది. కళ్లలో నీళ్లునిండాయి.

"బాబూ!" అని పిలుపు! అందులో ఎంత మాధుర్యం, ఎంత ఆప్యాయం, ఎంత ప్రేమ ఒలికిపోతున్నాయి.

"ఏం నాన్నా?" విచారంతో నాగొంతుక బొంగురు పోయింది.

"నాపని అయిపోయిందిరా బాబూ!" నేను దుఃఖాన్ని అణచుకుని,

"మీ రలా అధైర్యపడకండి నాన్నా - యిదుగో యీమందు తాగండి,... ఊఁ, నోరు తెరవండి" అన్నాను.

"ఇప్పుడేమీవద్దురా, నీతో రెండుముక్కలు మాట్లాడాలిరా."

మా జానకి పెద్ద డాక్టరుగార్ని తీసుకు రావడానికి నాతో చెప్పకుండానే పరిగెట్టి నట్టుంది, అక్కడలేదు.

"ఏమిటి నాన్నా?"

"నే చెప్పినట్టు చేస్తావా తండ్రీ"

"తప్పకుండా చేస్తాను నాన్నా"

"మీ చెల్లాయిని నువ్వు కన్నతండ్రిలా కాపాడాలి"

"తప్పకుండా"

"దానికి మంచి వరుణ్ణి చూచి పెళ్ళి చెయ్యాలి"

"అలాగే"

"దానికి పెళ్లి చెయ్యడానికి డబ్బు ఎక్కడిది?"

"నిజమే, డబ్బు ఎక్కడిది?"

"అందుకని నువ్వు ముందు పెళ్ళి చేసుకోవాలి"

మా నాన్న ఖర్ ఖర్ మని మళ్ళీ దగ్గేరు. ఆ ఆయాసం పావుగంటవరకూ తగ్గనేలేదు. మళ్ళీ మాట్లాడుతారని నేను అనుకోలేదు. మళ్ళీ ఆప్యాయంగా "బాబూ!" అన్నారు.

"ఏం నాన్నా?"

"నువ్వు నీబుద్ధి మార్చుకోవాలిరా బాబూ"

ఏమిటి మార్చుకోవడం? నాకేం అర్థమవలేదు.

"నువ్వు కట్నం పుచ్చుకు పెళ్లి చేసుకోవాలి?"

ఎంత విషమ సమస్య! ఈ విషయం గురించి ఎన్నో అహోరాత్రాలు నాకూ నాన్నకీ వివాదాలు జరిగేయి. ఇంకో అప్పుడయితే నేను అతి సులువుగా దిక్కరించేసే వాడిని. కాని యిప్పుడు ఏమనను?

"నీ కింకేవిధంగా డబ్బు వస్తుంది? చెల్లెలికి ఎలా పెళ్లి చేస్తావు? అను నాయనా అను కట్నం పుచ్చుకుంటానని అను. ఈ ప్రాణం నిశ్చింతగా పోతుంది."

అంటే ఏం పోయింది? తరువాత యీయన చూడొచ్చారా? అని క్షణం అనుకున్నా, వద్దని

నా అంతర్వాణి నన్ను నిలదీసింది. నా ఆదర్శాలు ఏం కాను? నేను నిత్యమూ దూషించి హేయంగా చూస్తున్న పద్ధతులను నేనే అమలులో పెట్టనా? మరి ఎలాగ? మరణశయ్య మీద కన్నతండ్రి కనీసపు కోర్కె! ఎలాగ? నా హృదయంలో తుఫాను చెలరేగింది. నా మనస్సులో యుద్ధం ప్రారంభమయింది. ఆఖరికి నేను "నేను"గానే నిలబడి గెలిచాను.

"ఏం బాబూ మాట్లాడవ్?"

ఎన్నో మాటలు చెబుదా మనుకున్నాను. స్త్రీధనం హేయం అని ఉద్ఘాటిద్దా మనుకున్నాను! మరోవిధంగా గణించి చెల్లెలికి పెళ్ళి చేస్తానని అందామనుకున్నాను. అంత దుఃఖంలో నోరు పెగల్లేదు. మాట రాలేదు. 'క్షమించండి, నాన్నా' అని బావురుమని ఆయన మీద పడిపోయాను. అంతే. నాన్నకు తెలివి తప్పిపోయింది.

చచ్చిపోయేవాళ్ళు బంధువులకోసం గాని, వైద్య సహాయం కోసంగాని ఆగుతారా? నలుగురిలోంచి నడిచి వెళ్ళిపోయినట్టు పోయారు నాన్న. మా జానకి రంగన్నగారిని తీసుకు రావడం, మా నాన్న ఆఖరిసారిగా విపరీతంగా దగ్గి వెనక్కి పడిపోవడం ఒక్కమారే జరిగాయి.

* * *

పదిరోజులూ గడిచాయి. జానకి గాజుల జత అమ్మగావచ్చిన డబ్బుతో అన్ని కార్యాలూ పూర్తయాయి. ఈ పదిరోజులూ రామగోపాలం నాకు కనపడలేదు. వాళ్ళ మేనమామ ఊరు వెళ్ళేనని అక్కడికి వెళ్ళేక వ్రాశాడు: "ఇక్కడ సంబంధాలున్నాయి చూసుకుందుగాని రా" అని వాళ్ళ మేనమామ రాస్తే గోపాలం శ్రీకాకుళం వెళ్ళాడు.

మధ్యాహ్నం రెండవుతుంది. నేనూ జానకీ నాన్నగారి ఘనకార్యాలనీ, పనుల్నీ జ్ఞాపకం తెచ్చుకుని దుఃఖపడుతున్నాం. చేతిలో ఒక పచ్చని కాగితం పట్టుకుని రామగోపాలం వచ్చాడు. జానకి లేచి లోపలికి వెళ్ళిపోయింది.

"ఎంతపని జరిగిందిరా, యింతలో యిలా అవుతుందని నే అనుకోలేదు. నే వెళ్ళేటప్పుడు బస్సుదాకా వచ్చి దిగబెట్టేరు సుమా! ఈ పదిరోజుల్లో నేయింత అఘాయిత్యం జరుగుతుదనుకోలేదు" అని విచారం వెలిబుచ్చాడు.

"ఎంత నెమ్మది, ఎంత శాంతం,– ఏమంత పెద్దవయస్సని? ఇంతలోనే నూరేళ్ళు నిండిపోతాయనుకోలేదురా" అన్నాడు. అందరిలాగా రామగోపాలంకూడా అంటాడని నేనూ ఎప్పుడూ అనుకోలేదు. మా నాన్నగారు అంత చెప్పుకోదగిన మంచి మనిషి కాదు. ఎందుకో యీ వర్ణన? చనిపోయినంత మాత్రాన లేని మంచితనం అంటుకుంటుందా? ఇక్కడ నేనొక చిన్న తమాషా చెప్పవలసి ఉంది.

మా నాన్నగారికి రెండేళ్ళక్రితం యిలాగే గుండెజబ్బు ఎక్కువై, దగ్గూ, ఆయాసం విపరీతంగా వచ్చేశాయి. ఆగండం గడచి మా నాన్నగారు బ్రతుకుతారని మే మెవ్వరం అనుకోలేదు. అప్పుడు ఊళ్ళోవాళ్ళందరూ "బిడ్డలకిద్దరికీ తల్లిలేని లోటు రానిచ్చేవాడు కాదు పుణ్యాత్ముడు. ఇంతలోనే కాలం చెల్లిపోయింది కాబోలు" అని ఎంతో విచారించారు. మా నాన్నగారికి జ్వరం తగ్గి మళ్ళీ బ్రతుకులో పడ్డారు. వెనుక విచారించినవాళ్ళే, "చూసే వుంటే ముసిలిముండాకొడుకు ఎలా బతుకొచ్చాడోను– ఇలాంటి వాళ్ళందరూ బతుకుతూ వుంటే, వయస్సులో ఉన్నవాళ్ళకు రోజులు నిండిపోయాయంటే, నిండిపోవూ?" అనుకున్నారు!

మిత్రుణ్ణి చూడగానే నేను కొంతసేపు దుఃఖపడ్డాను. తరువాత మా మామూలు వాదనలలోకి దిగింది సంభాషణ. కొంతసేపయిన తరువాత గోపాలం తను తెచ్చిన శుభలేఖ చేతిలో పెట్టేడు. తనకే పెళ్ళట!

మేమిద్దరం ప్రాణస్నేహితులమైనా మా యిద్దరి అదృష్టాలకి ఎంత తేడా! ఈ వారం రోజులలోనే రామగోపాలం శ్రీకాకుళం వెళ్ళి పెళ్ళికుదుర్చుకుని, శుభాలలో మునిగిపోయాడు. మేం యిక్కడ దుఃఖసముద్రంలో మునిగిపోయాం.

"మళ్ళీ చైత్రంలోకాని ముహూర్తాలు లేవుట. ఇప్పటికే అమ్మాయి పెద్దదయి ఇంట్లో కూర్చున్నదని మా కాబోయే మామగారు

తొందర పెట్టేశారుట. అనుకోకుండా. అంతా అలాజరిగిపోయిండి" అన్నాడు రామగోపాలం.

"గణించుకోకుండా పెళ్లిచేసుకోనన్నావ్, అమ్మాయిని చూసేసరికి బుద్ధులన్నీ మారిపోయా యేమిటి?"

"అబ్బే, లేదు. మా మామగారు అక్కడే 'సబ్ మేజిస్ట్రేట్'గా వర్క్ చేస్తున్నారు. ఆయన కింద ఏదో పోస్టు ఖాళీగా ఉందట. నన్ను సెలక్ట్" చేయించారు.

"ఇంకేం. అన్నీ కలిసొచ్చాయన్నమాట- అయినా మామగారి చేతికింద ... ఏమిటో, నాకేం నచ్చలేదు."

"ఎవడో తెలియనివాడి చేతికింద వర్క్ చెయ్యడం బాగుందిగాని..."

"సరే, యింక ఆవూళ్ళోనే కాపురమన్న మాట...కట్నం పుచ్చుకుంటున్నావా?"

"పుచ్చుకుంటున్నాను- మూడు వేలు."

నేనీమాట వినగానే నిర్ఘాంత పోయాను. ఇన్ని కబుర్లు చెప్పినవాడు, యింత ఉదాత్త ఆశయాలు కలవాడని నేను అనుకున్నవాడు- తనే కట్నం పుచ్చుకోడం, స్త్రీధనాన్ని ఆశించడం, నాకు వింతగా తోచింది. ఇలాంటి వాడు ఆ పని చేస్తున్నాడంటే అందులో ఏమైనా మంచి ఉందేమో అని నాకనిపించింది. ఇదేదో సాయంకాలం మాట్లాడి నేనో తనో గెలిచి తీరాలనుకొన్నాను.

"సాయంకాలం అలా పార్కుకి వస్తావా, నీతో కొద్దిగా మాట్లాడాలి" అన్నాను. గోపాలం నేనూ అనుకున్నట్టే పార్కులో కలుసుకొన్నాం. ఇద్దరం అందరికీ దూరంగా ఆకుపచ్చని గడ్డిలో కూర్చున్నాం.

"పెళ్ళికూతురుకంటే, నువ్వేవిధంగా గొప్ప వాడివి?"

"అని, ఎవరన్నారు?"

"వేరే అనాలా? మరి, కట్నం ఎందుకు పుచ్చుకుంటున్నట్టు?"

"అందులో ఆ అర్థం లేదే?"

"ఆడపిల్ల. గణించుకో లేనిది, దాచుకుంటుంది. నువ్వెందుకు కట్నం యివ్వకూడదూ?"

"పెద్దవాళ్ళు పెట్టేరు. మంచికో, చెడ్డకో- దాన్ని మనం కాదనకూడదు."

"ఓహో! ఇలాంటప్పుడు పెద్దవాళ్ళు అవసరం వస్తూంటుంది కాబోలు- పెద్దవాళ్లు మంచి చెప్పినా, చెడ్డచెప్పినా అనుసరించి తీరవలసిందే నన్నమాట ఇంక స్వంతబుద్ధి, స్వప్రయోజకత్వమూ ఏమీ లేదన్నమాట."

గోపాలం మాట్లాడలేదు.

"శక్తి ఉంటే మనం గణించుకోవాలి. లేకపోతే నోరు మూసుకు ఊరుకోవాలి. ఏ విధంగా అయినాసరే సొమ్ము వస్తే చాలునని పడేసుకోడమే? ఆత్మగౌరవ ముండొద్దూ?"

వాడు మాట్లాడలేదు.

"నీ యిష్టంసుమీ, నాకిలా తోచింది- నీకు మరోలా తోచవచ్చు నాకునచ్చింది చెప్పేను. అంతే"

"ఒరే, యీ లోకంలో మనం ఉన్నంత కాలం, మనకు యిష్టం లేకపోయినా, యీ లోకపు పద్ధతుల్ని అనుసరించుకు పోవాలి. మనం ఒక్క మంచిపని చేద్దామంటే వెయ్యి అడ్డంకులు. అపని చేసేకన్నా అది మానేసి నలుగురిచేతా ఎందుకు మంచి అనిపించుకోకూడదు?"

నేను జవాబు చెప్పలేదు. చీకటి పడగానే యిద్దరం ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయాం.

మా నాన్నగారు పోగానే సంసారబాధ్యత అంతా నామీద పడింది. ఆయనకి నెలా నెలా వచ్చే నూరు రూపాయిల పెన్షన్‌తో, నా చదువుకు అప్పుడే నానాయిబ్బంది అయేది. ఆయన పోగానే ఆ ఆశకూడా పోయింది. ఇంక ఎటొచ్చీ మాకుమిగిలిందల్లా రెండెకరాలభూమి మాత్రమే. బియ్యానికి యిబ్బంది లేకపోయినా యీ కరువు రోజుల్లో తక్కిన ఖర్చులికి చాలా అవస్థపడిపోయాం. నేను చదువు మానేసి ఉద్యోగం కోసం విశ్వ ప్రయత్నాలు చేశాను. ఎక్కడా ఏ ఉద్యోగమూ దొరకలేదు. ప్రతీ ఉద్యోగానికి ముందుగా బోలెడేసి లంచాలు పొయ్యాలి. ఆఖరికి ఒక స్నేహితుడి సహాయంతో రాత్రీ పగలూ తెగతిరిగి కలక్టరాఫీసులో ఏభై రూపాయిలకి గుమాస్తాగా "జాయిన్" అయ్యాను. జానకి యింట్లో వంట చేసేది.

ఆవాళ వినాయకచవితి, నా పుట్టినరోజు.

ఇరవై వెళ్ళి యిరవై ఒకటి వస్తాయి. జానకి నాకంటె రెండేళ్లు చిన్న. ఆమాట తలుచుకోగానే నా మనసు ఎంతో బాధపడింది. రోజులు గడవడమే కష్టంగావుంది. జానకికి పెళ్లెలా చెయ్యను? రాత్రీ పగలూ యిదే సమస్య. రెండు మూడు సంబంధాలు వచ్చాయి. స్కూలు ఫైనలు నాలుగుమార్లు కట్టి ప్యాసయిన వెధవకూడా కట్నం మడగడమే. ఇదొక బేరం! ఏమయినా సరే. కట్నం యివ్వకుండానే జానకికి పెళ్ళి చేద్దామని నిశ్చయించుకున్నాను. ఇలాంటి ఆలోచనలతో అలా పడక కుర్చీలో పడుకుని నిద్రపోయాను. నేను లేచేసరికి జానకి ఎవరో మరో ఆవిడతో మాట్లాడుతోంది. ఎవరో పొరుగావిడ అని నే ననుకున్నాను.

"మళ్ళీ మళ్ళీ చెప్పలేదనుకోక-మీ రిద్దరూ తప్పకుండా వచ్చేయాలి. అందరం కలిసే వెడతాం" రామగోపాలం చెల్లెలు కమల. పాపం నాలుగు రోజుల పాటయినా మొగుడితో సుఖంగా ఉందా? పెళ్ళయిన నాలుగు నెలలకి అతనికి పెద్దమ్మవారొచ్చి చనిపోయాడు.

"అయ్యో, ఎంత మాట?. మీరు పదేపదే చెప్పాలా? మా అన్నయ్య లేవగానే చెప్తాను."

"మా అన్నయ్యే వచ్చి పిలిచి ఉండును, కాని అవసరమైన పనులుండి ముందుగా వెళ్ళవలసి వచ్చింది. మీరు రాకపోతే మా అన్నయ్య చిన్నబుచ్చుకుంటాడు. చెప్తారు కదూ, వస్తానూ!" ఆ అమ్మాయి తారాజువ్వలా వెళ్ళిపోయింది. ఆ మసక చీకట్లో ఆమె కళ్లు తళతళా మెరిశాయి!

రామగోపాలం పెళ్లి లక్షణంగా జరిగింది. నేనూ, జానకీ, కమలా, యింకా కొందరు వారి బంధువులూ అందరం కలిసి వెళ్లేం. దారిలో కమలని పరిశీలనగా చూసే అదృష్టం ఒకటి రెండుసార్లు పట్టింది. వర్ణనలెందుకు, ఆ పిల్ల నాకు మనసార నచ్చింది. పెళ్లయిన నాలుగో రోజో, అయిదో రోజో నేనూ, రామగోపాలం అలా ఏటి ఒడ్డుకి షికారు వెళ్ళేం. నేను యీ విషయంలో వాడిని కదిపిచూశాను. వాడు బ్రహ్మానంద భరితుడయ్యాడు "అంతకంటేనా!" అని పొంగిపోయాడు. ఆ మరుసటి నెలలో నాకూ, కమలకీ రిజస్టరు మేరేజ్ అయింది.

ఇంతకు ముందు ఆఫీసునుంచి వచ్చేసరికి జానకి సోదర ప్రేమలో వున్న లాలన కంటే, కమల చూపే శ్రద్ధ, నన్నెక్కువ సుఖపెట్టి కొత్త రకం ఆనందాన్ని ప్రసాదించేది. ఓనాడు నాకు ఆఫీసులో పని ఎక్కువై బాగా చీకటిపడ్డాక వచ్చాను. భోజనాలు చేసిన తరువాత కమల "ఇలా రాత్రీ పగలూ చాకిరీ చేస్తే ఏ రోగమయినా వస్తుంది. మా అన్నయ్యకు రాయకూడదూ, వాడి మామగారి చేతికింద లక్ష పనులుంటాయి - ఏదో ఒకటి సుళువయినదీ కాస్త జీతం యెక్కువయిన దానికోసం ప్రయత్నిస్తాడు" అంది.

"అవునన్నయా, అలా చెయ్యి" అంది జానకి కూడా.

"ఛీ, నా ఖర్మం కాలిందేమిటి, వీళ్ళనీ వాళ్ళనీ ఆశ్రయించడానికి? నాకు చేవవుంటే నే సంపాదించుకోవాలి గాని" అన్నాను నేను.

"మనకున్న చేవకి, ఏ ప్రయత్నాలూ చేయకుండా పెద్దపెద్ద ఉద్యోగాలు ఎలా దొరుకుతాయి?" హేళనగా అంది కమల.

"పెద్దపెద్ద ఉద్యోగాలు కావాలని ఎవరన్నారు?" అన్నాను కోపంగా నేను. కమల మరి మాట్లాడలేదు. తరువాత జానకీ, కమలా అన్నాలు పెట్టుకు తిన్నారు. కమల పడకగదిలోకి వచ్చింది.

"ఏమండీ, వదినని యింకా ఎన్నాళ్లు ఇలా ఉంచుతారు?" అని వస్తూనే అడిగింది.

"ఏం, నీకేమైనా బరువుగా ఉందా?" అన్నాను నేను పరధ్యానంగా.

"ఉండదుమరీ, రోజూ కొట్టుకుచస్తున్నాం, చూస్తున్నారుగా" అని అసహ్యంగా అటువైపు కోపంగా తిరిగిపోయింది.

"అంతలో కోపం ఎందుకు? తమాషాకన్నాను" అన్నా లాలిస్తూ.

"తమాషాకేమిటి, ఎలా అన్నా అంటారు మీకేం? మిమ్మల్నెవరూ ఏమీ అనరు గదా!"

"ఏం ఎవరేమన్నారేమిటి?"

"ఎదిగినపిల్లని యింట్లో పెట్టుకు కూర్చుంటే ఎవరేమన్నా అంటారు. ఎవరేమంటే ఏంగాని

పాపం ఆ పిల్ల ఎంత బాధపడుతున్నదో ఆలోచించారా?"

ఈ మాటలు విన్నగా నా హృదయంలో గుచ్చుకున్నాయి. మేమిద్దరం గదిలో యిలాగ, అది అలా నడవలో ఓ చాప పరచుకుని-ఛా-ఓ కడుపున బుట్టినా మా యిద్దరికీ ఎంత భేదం? ఇన్నాళ్ళూ పొరుగింటి విధవపిల్ల కమల ఎంత బాధ పడుతున్నదో అని ఆలోచించాను గాని, యింట్లో ఉన్న తోటి చెల్లెలు ఎంత మథన పడుతున్నదో ఆలోచించానా? నేనెంత స్వార్థపరుణ్ణి! పాపం ఎంత బాధ పడుతున్నా సిగ్గు విడిచి, నోరు విడిచి జానకినాతో ఒక్క మాటచెప్పిందా? నా హృదయం ఎంతో బాధపడింది. తత్ఫలితంగా మేము ఆ రాత్రి వేరు వేరుగా పడుకున్నాం!

* * *

"ఈఉత్తరం ఎవరురాయమన్నారు నిన్ను?" నేను రాగానే అతి కోపంగా అడిగాను కమలను. గదిలో వంటచేస్తున్న కమలా, వసారాలో పువ్వులు గుచ్చుకుంటూన్న జానకీ నన్ను చుట్టుముట్టేశారు.

"ఏ ఉత్తరం?" అని అడిగింది కమల ఆశ్చర్యంగా.

"ఇక్కడ పాపం మహా బాధలన్నీ పడిపోతున్నావు కదూ, ఎలా అయితేనేం లేని వాడిని కట్టుకున్నావ్ - మరి నీలా అందరూ భాగ్యవంతులుంటారా? మీ అన్నయ్యలా అందరూ మామగారి ప్రాపకాన్ని బతుకుతారా? ఇక్కడ ఏదో పెద్ద యిబ్బందులు పడిపోతున్నట్టు ఎలా ఏతేనేం రాశావు ఉత్తరం. ఇదిగో మీ అన్నయ్య పంపించాడు నూరు రూపాయలు. తీసుకో. ఇక్కడ మాత్రం ఒక దమ్మిడీ ఖర్చు పెట్టేవా నీకూ నాకూ నేటితో సరి. లేకపోతే ఏమిటి? నన్ను కట్టుకున్నది నాతో కలో గంజో తాగి పడుండాలి - వాళ్ళన్నకి డబ్బుంటే వాళ్ళ నెత్తిమీద పెట్టుకు ఊరేగుతారు, మాకెందుకు పంపాలి?" నేను కొంత శాంతించే వరకూ కమల మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా యిలా అంది,

"ఏమండీ, నాతో తెచ్చుకున్న చీరలన్నీ చిరిగిపోయాయి. మీ చెల్లెలికి సరిఅయిన చీర ఒక్కటీలేదు. ఎప్పుడు కొనుక్కుందామన్నా యింట్లో ఖర్చుకే సరిపోవడంలేదు. అందుకని రాశాను. క్షమించండి" అంది సాధారణంగా. ఆ మాటలు నా కోపాన్ని యినుమడించాయి కాని తగ్గించలేదు. మనకు లేకపోతే జానెడు గుడ్డ కట్టుకుని మన యింట్లో ఉంటాం, ఇంకొకళ్ళని 'దేహీ' అని అడుగుతామా? ఈనాటికి వచ్చేసింది వదినగారిమీద ఎక్కడ లేని ప్రేమాను. మాకేం నువ్వు తెచ్చి పొయ్యక్కరలేదు. మా బాధలు మేం పడగలం... యీసారి యిలాంటి ప్రసక్తి తెచ్చావా అనవసరంగా గొడవలు జరుగుతాయి" అని హెచ్చరించాను. లేకపోతే ఏమిటిది?

ఆరాత్రి నాకు ఒకంతటికి నిద్రపట్టిందికాదు. చిన్నప్పట్నుంచీ చెల్లాయీ నేనూ ఎంత ప్రేమాభిమానాలతో పెరిగామో గుర్తొచ్చింది. మారిన వాడిన నేనేమోగాని నాటికీ నేటికీ చెల్లాయికి నామీద ప్రేమ ఒక్కలా వుంది. తన ఏకత్వంలోని కష్టాన్ని గాని, తన సాధక బాధకాలుగాని ఎప్పుడైనా చెప్పి నన్ను నొప్పించిందా? చీరలు లేవని కమల చెబుతే విన్నాను గాని, తను ఏనాడైనా నోరుతెరచి దమ్మిడీ అడిగిందా? ప్రేమతో నా ఒళ్ళు పులకరించింది. వాత్సల్యంతో నా నేత్రాలు చెమర్చాయి. ఆ పవిత్రమూర్తిని ఒకమారు చూడాలని బుద్ధి పుట్టింది. లేచి నడవలోకి వెళ్ళి చూచాను. జానకి చాపమీద లేదు! దొడ్లోకి వెళ్ళిందేమో అని చూశాను. అరగంటయినా జానకి రాలేదు. మరో గడియకు జానకి పెరట్లోంచి వచ్చింది. అప్పటి జానకి ఆకారం చూస్తే ఎలాంటివాళ్ళకేనా అనుమానం కలుగక మానదు. బాగా నలిగి పోయిన తెల్లని చీరా, రేగిపోయిన జుత్తు, అందులోంచి బయటకు పడిపోతున్న మల్లె దండా, సరిగాలేని పమిట - ఏమనుకోను?

"ఇంతరాత్రి ఎక్కడికి వెళ్ళేవే జానకీ?"

జానకి తడబడుతూ, "దొడ్లోకి వెళ్ళే నన్నయ్యా!" అంది.

అంతకన్న ఏం అడగను. ఏం చెబుతుంది? ఓ గడియ సందేహించినా, యిలాంటి నిష్కల్మషమూర్తిని అనుమానించనా? అని తటపటాయిస్తూ గదిలోకివచ్చి పడుకున్నాను. ఓపట్టాన

నిద్ర పట్టలేదు. ఏది ఏమైనా, వీలైనంతత్వరలో జానకికి పెళ్ళి చేసెయ్యాలి. అది ఒకవేళ కాలు జార్చుకున్నా, వయస్సులో ఉన్నపిల్ల దాని తప్పేముంది?

* * *

మొదటి కాన్పేమో, కమలకి పురుడు రాడం చాలాకష్టమయిపోయింది. జానకి దగ్గర ఉండి అలా కమలని కంటికి రెప్పలా కాపాడబట్టిగాని, లేకపోతే నాకేం తెలుసునని? పెద్ద దొరసానమ్మను పెడితే అంత యిబ్బంది అవకపోనేమోగాని, దానికిమళ్ళీ నలభైలూ, ఏభైలు ఎక్కడ పొయ్యగలం? దేవుని దయవల్ల ఎంత కష్టపడ్డా ఫలితం దక్కి, నా కమలా, నా చిట్టి తండ్రీ నాకు దక్కేరు.

ఆఫీసులో ఉన్నంతసేపూ పిల్లాడిమీదే ఉండేది ధ్యానం. నాకెన్ని కష్టాలున్నా వాడి మొహం చూసేసరికి క్షణకాలంఅన్నీ మరచిపోయేవాడిని. పత్యంతిన్న ఐదోరోజు కాబోలు కమల నన్ను చాటుగా పిలచి "ఏమండీ. వదిన ప్రవర్తన ఏమీ బాగులేదు సుమండీ, తరువాత విచారించి లాభంలేదు. ఎదురింటి భాస్కరంతో ఒకటే మాటలు. ఎవరైనా వింటే బాగుంటుందా?" నేను చేతులతో తల బాదుకున్నాను. దానిదికాదు తప్పు, నాది. నేనేమీ చెయ్యలేని స్థితిలో ఉన్నాను. దానిని నా నోటితో నేను ఒక్కమాట అనలేను. తల బాదుకోకా, జుట్టు పీక్కోకా నేను చేసేదేమిటి?

"మీరలా బాధ పడతారంటే నేను చెప్పకనే పోదును" అని కమల నా చేతికి పిల్లాడినందించింది. కమలకు తెలుసు, నేనెప్పుడు విచారంగా ఉన్నా నా చేతికి పిల్లాడినందిస్తుంది. నా ఆశాజ్యోతి నాలోని దుఃఖ తిమిరాన్ని తరిమి పారేస్తుంది. ఈసారీ అలాగే అయింది. మా యింటికి వచ్చే శాస్త్రుల్లుగారు రెండు సంబంధాలు తీసుకొచ్చారు. ఒకటి రెండో పెళ్లి, యింకోటి భార్య వదిలేసిన వరుడూను. వీరిద్దరేనా కట్నం పుచ్చుకోకుండా ముందుకొచ్చి పెళ్ళి చేసుకొనే మహావీరులు? తల్లిదండ్రులు తెచ్చిన సంబంధాల్ని కట్నాలతో చేసేసుకోడమేతప్ప, యిలాంటిఅనాథల్ని ఉద్ధరించే మొగాళ్లు నూటికీ ఒక్కరేనా లేరా?

* * *

పిల్లాడి బారసాలకి రామగోపాలం, సత్యవతీ వచ్చారు రామగోపాలం వస్తూనే "ఏంరా యిలా తయారయావు? నీ ఆదర్శాలూ నీ ఆత్మాభిమానం నీతో తీసుకెడతావుట్రా? అంత దాకా నీతో ఉన్నవాళ్ళు బాధపడడమే నన్నమాట"

విషయమేమిటో నాకు అర్థం కాలేదు

"ఏమిట్రా అదీ?"

"ఇంకేమిటీ, చెల్లాయికి పురుడొస్తే ఖర్చయిపోతుందని పెద్ద దొరసానినేనా పెట్టావుట కాదుకదూ? మేం అందరం బ్రతికే ఉన్నామనుకున్నావా, చచ్చాననుకున్నావా, కాణీ అడిగితే నీ సొమ్మేం పోయింది?"

నా ఒళ్లు మండిపోయింది. నా కిష్టమైతే నా పెళ్ళాన్ని పరపరా కోస్తాను. వీడెవడు నన్నడగడానికి?

"నాయిష్టం. నాయిష్టం ఒచ్చినవాళ్ళచేత, నా పెళ్ళానికి పురుడు పోయిస్తాను. నువ్వెవరు నన్ను నిలదియ్యడానికి?"

నానుంచి యిలాంటి జవాబు ఆశించకపోవడంవల్ల గోపాలం వెలవెలా బోయాడు. సత్యవతిమాత్రం ఊరుకోలేదు.

"ఏదో, నాలుగురోజులపాటు వదినదగ్గిర వుందామని పిలుస్తే వచ్చాంగాని, మనం మాటలు పడ్డానికి రాలేదు. జట్కా యింకా వెళ్ళిపోయినట్లు లేదు. పిలవండీ పోదాం"

"అన్నయ్యా, రాకరాక వచ్చావు వెళ్లిపోకు. ఆయన కోపంమీద ఏమైనా అంటారు నా మొహంచూసి ఆగు" అన్నది కమల

"ఎందుకమ్మాయ్, నీకేం గడవక ఇక్కడికి వచ్చావా? నీ అదృష్టం బాగుందిగాని చంపేసును దుర్మార్గుడు! చాలు, సంసారసుఖం. నాతో వచ్చేయ్" అన్నాడు.

"ఊఁ వెళ్లు, చూస్తావేం? ఇక్కడి కబుర్లు అక్కడికి ఏరోజు కారోజు మొయ్యక్కర్లేదులే. ఇంక అన్నీ నోటితోనే చెప్పొచ్చు. దయచెయ్యి"

రామగోపాలం, సత్యవతీ గుమ్మం అవతలే ఉన్నారు. పిల్లాడినెత్తుకున్న కమలని వీధిలోకి గెంటి తలుపు వేసేశాను. ఆ తొందర

రలో నా చిట్టి తండ్రి గులాబీ వేలు తలుపు సందుల్లో పడిపోయింది. పాపాయి ఏడ్పు మన్నాడు. లేద్దామని తలుపుదాకా వెళ్లి మనసు సరిపెట్టుకు యివతల కొచ్చేశాను.

"రాక్షసుడు, ఉన్మాదుడు" అన్నారు సత్య వతీ, గోపాలం ఒక్కసారే. అవును, ఆత్మాభి మానం కలవాడు రాక్షసుడే!

నాకు దుఃఖం వచ్చేసింది. నా అంతరాత్మ పూర్వకంగా చేసిన మంచిపనులకి, ఆదర్శాలకి, అపజయం కలగడం నా మనసు భరించలేక పోయింది. నా హృదయం విచారంలో మునిగి పోయింది. తిరిగి నా మనస్సుని ఆనందమయం చెయ్యడానికి నా యింటిలక్ష్మి ఏదీ? నా హృదయాన్ని ప్రఫుల్లం చెయ్యడానికి నా ఆశా జ్యోతి ఏదీ?

నా ముద్దులపాప ఏడీ?

పన్నెండు గంటలు కొట్టేవరకూ, నేనే ప్రపంచంలో ఉన్నానో నాకే తెలియదు. అప్పుడు లేచి మొహం కడుక్కున్నాను. విప రీతంగా ఆకలి వేస్తోంది. జానకి ఏదీ? పొద్దుట నుంచీ ఆ వూసులోపడి నా చెల్లాయి ఏమైందో మరిచిపోయాను. నా వెర్రిచెల్లి ఏదీ?

నేనూ, జానకీ హాయిగా కలసి మెలసి ఉన్నంతకాలం ఏబాధా లేదు! ఏ చీకూ చింతా లేదు. మధ్య వచ్చినవాళ్లు మధ్యన వెళ్ళిపో యారు. నాకు పెళ్ళికాలేదు అనుకుంటాను. నా ముద్దులచెల్లాయికి పెళ్ళి చెయ్యను. నా దగ్గిరే కలకాలం ఉంచుకుంటాను. వాత్సల్య జలధిలో మునిగిపోతాం. నాకు జానకి. జాన కికి నేనే ప్రపంచం. జానకి ఏదీ? ఇంతసేపు చెప్పకుండా ఎక్కడికీ వెళ్ళదే. ఏమైనట్టు?

ఇల్లంతా వెతికేను. నా వాత్సల్య లక్ష్మి నాకు కనపడలేదు. వంటయింట్లో బిందెమీద ఓ ఉత్తరం ఉంది. వణుకుతున్న చేతులతో విప్పి చదివేను.

"నా వెర్రి అన్నాయ్!

నిన్ను వదలలేక, వదలలేక వెడుతున్నాను. వెళ్ళక ఏంచెయ్యను? ఈ ప్రపంచంలో బ్రతికే పద్ధతులు నువ్వు అలవరచుకో లేకపోయావు. భాస్కరంతో వెళ్ళిపోతున్నాను. నన్ను క్షమించి, ఆశీర్వదించు అన్నాయ్!

జానకి"

ఆ ఉత్తరాన్ని కన్నీళ్ళతో తడిపేశాను. పదిమార్లు ఆప్యాయంగా ముద్దెట్టుకున్నాను. చెల్లాయిని మనసులో ఆశీర్వదించాను. ఉత్త రాన్ని గుండెలకు రాసుకున్నాను. అంతకన్నా యీ నిర్భాగ్యుడు యింకేం చెయ్యగలడు!

"నీకింకే విధంగా డబ్బు వస్తుంది? చెల్లెలికి ఎలా పెళ్ళిచేస్తావ్? అను నాయనా అను. కట్నం పుచ్చుకుంటానని అను. యీ ప్రాణం నిశ్చింతగా పోతుంది."

"ఒరే, యీ లోకంలో మనం ఉన్నంత కాలం, మనకు యిష్టం లేకపోయినా, యీ లోకపు పద్ధతుల్ని అనుసరించుకు పోవాలి. మనం ఒక్క మంచిపని చేద్దామంటే వెయ్యి అడ్డంకులు. ఆ పని చేసేకన్నా ఆ పనిమా నేసి నలుగురిచేతా ఎందుకు మంచి అనిపించుకో కూడదు?"

"మనకున్న చేవకి, పెద్దపెద్ద ఉద్యోగాలు దొరకమంటే మాత్రం ఎలా దొరుకుతాయి?"

"ఈ ప్రపంచంలో బతికే పద్ధతులు నువ్వు అలవరచుకో లేకపోయావుగా నా వెర్రి అన్నాయ్."

"నీ ఆదర్శాలూ, నీ ఆత్మాభిమానం కూడా తీసుకు వెడతావుట్రా? అంతదాకా నీతో ఉన్నవాళ్లు బాధ పడడమేనన్నమాట."

"ఆపిల్ల గణించుకో లేనిది, కట్నం యిస్తే దాచుకుంటుంది. నువ్వే ఎందుకు యివ్వకూడదు? నువ్వు మా కమలకు ఎందుకు యిచ్చావుకావు?"

"ని ఆఫీసరు నీకిస్తున్న జీతండబ్బు మాత్రం పవిత్రమైనదని ఎక్కడుంది? వాడు ఎందరి దగ్గిర లంచాలు పుచ్చుకున్నాడో. ఎంత స్త్రీ ధనాన్ని అపహరించాడో! ఆ సొమ్ము ఇన్నాళ్లు నువ్వు తినలేదూ, మరి నీ ఆత్మాభిమానం ఏమైంది?"

"రాక్షసుడు – ఉన్మాదుడు"

నిజమే, నేను ఉన్మాదుడినే! లక్ష్మీదేవికి నీతి నియమాలు లేనంతకాలం నాలా "ప్రిన్సిపల్స్"మీద నడిచే వాళ్లందరూ ఉన్మాదులే! నేను రాక్షసుణ్ణి కానూ మరి? రాక్షసుణ్ణే — నిర్భాగ్యుడినే!